క్లుప్తంగా

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగాల : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న మండలంలోని ఆకుపాములలో గల టీటీడబ్ల్యూఆర్ డిగ్రీ కళాశాలలో పార్టు టైమ్ అతిథి ఫ్యాకల్టీగా పనిచేయుటకు, యూజీ స్థాయిలో ఆయా సబ్జెక్టులలో బోధించేందుకు అర్హత, అనుభవం ఉన్న ఫ్యాకల్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు టీటీడబ్ల్యూఆర్ సెక్రటరీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ, సెట్, నెట్, పీహెచ్‌డీ కలిగి ఉండి కనీసం రెండు సంవత్సరాల బోధన అనుభవం ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు టీటీడబ్ల్యూఆర్ డీసీఎస్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. దరఖాస్తులు స్వీకరణకు ఈనెల 16 చివరి తేదీ అని తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



మన ఊరు - మన బడి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ పార్వతి

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు– మన బడి పనులను మంగళవారం ఎంపీపీ పార్వతీకొండానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఉపసర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సైదాకుమారి, మాజీ ఎంపీటీసీ నాగునాయక్, హెచ్‌ఎం లూర్దుమారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ వీరయ్య తదితరులున్నారు.

సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న గెల్లి రవి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయిని గూడెంలో రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గెల్లి రవి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎ.గంగరాజు నాయకులు గురవయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, ఎం.లింగయ్య, ఎన్.సాంబయ్య, ఎం.చిన్న వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగరాజు, వీరస్వామి పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండాలో గల జి.బాబునాయక్ క్షేత్రంలో భూసార పరీక్షలు (మట్టి నమూనాల సేకరణ)పై రైతులకు కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాలు సేకరించే విధానం, వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి తెలిపారు. ఏ నెలలో ఏ పంటలు వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకోవాలన్నారు. దీంతో పంటల దిగుబడినే కాకుండా నెలకు అందించే పోషకాల ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. పచ్చిరొట్టే ఎరువుల ప్రాముఖ్యత, సేంద్రియ పద్ధతుల్లో భూసారాన్ని పెంచే పద్ధతులు తదితర విషయాలను వివరించారు. అనంతరం ఉద్యానవన శాస్త్రవేత్త కురగాయాల పంటల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు సుజాత, కమల, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

ప్రతిభావంతులను పురస్కారాలు వరిస్తాయి



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న అనురాగ్ కళాశాల బృందం

అనంతగిరి : ప్రతిభావంతులను పురస్కారాలు వరిస్తాయని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎంవీ శివప్రసాద్ అన్నారు. భారత కంప్యూటర్స్ సమాఖ్య హైదరాబాద్ విభాగం వారి నుంచి ఎక్సలెన్సీ అవార్డు పొందిన ప్రముఖ వీఆర్ కన్సల్టెంట్ ప్రతినిధి పి.వి రమేష్‌ను మంగళవారం స్థానిక అనురాగ్ కళశాల బృందం శాలువాలతో ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శివప్రసాద్ మాట్లాడారు. పి.వీ రమేష్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ తనిఖీ సలహాదారుడిగా విద్యార్థులకు, పరిశ్రమలకు అవసరమైన ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించారని అన్నారు. అనంతరం కళాశాల యాజమాన్య ప్రతినిధులు కె.జైపాల్‌రెడ్డి, పాండురంగప్రసాద్, భూపతి, కళాశాల సిబ్బంది. విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



జి.లక్ష్మి, హెచ్‌ఈసీ, (967)



ఎ.చైతన్య, ఎంపీసీ, (461)



కె.శివాని, ఎంపీసీ (969)



వి.రాధిక, బైపీసీ (967)



ఎం.జ్యోతి ఎంపీసీ, (461)



బానోతు స్వప్న, బైపీసీ, (949)



తొండల నవ్య, ఎంపీసీ (964)



పిల్లుట్ల లోక్యా, ఎంపీసీ (958)



కె.అనూష, ఎంపీసీ (967)



బి.శిల్ప, ఎంపీసీ (960)



భూక్యా సోనియా (బైపీసీ) 949

మునగాల : తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం ప్రకటించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 97 శాతం, ఎంపీసీలో 97 శాతం, సీఈసీలో 87 శాతం, ఎంఈసీలో 94 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 84 శాతం, బైపీసీలో 66 శాతం, సీఈసీలో 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎం.ఐశ్వర్య 962/1000 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించగా డి.దీపిక 961/1000 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. బైపీసీలో టి.మానస 957/1000, వినీల 952/1000 సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు ఆమె తెలిపారు.

కళాశాల ద్వితీయ స్థానంలో జి.లక్ష్మి

హుజూర్‌నగర్ : ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం హెచ్‌ఈసీ విద్యార్థి జి.లక్ష్మి 967/1000 మార్కులు సాధించి కాలేజీలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరంలో పి.చైతన్య ఎంపీసీ విభాగంలో 461/470 మార్కులు సాధించి కాలేజీలో ప్రథమ స్థానంలో నిలిచింది. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులతో పాటు పలువురు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల, కరివిరాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు సోమయ్య, ధనవిజయలక్ష్మి, ఎస్‌కే.షరీఫ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 38 శాతం, వృత్తి విద్యా కోర్సుల విభాగంలో 49 శాతం, అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 62 శాతం, వృత్తి విద్య విభాగంలో 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 81 శాతం, ద్వితీయ సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరం 40 శాతం, ద్వితీయ సంవత్సరం 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ సెకండియర్ విద్యార్థిని కె.శివాని 969 మార్కులు, బైపీసీ సెకండియర్ విద్యార్థి వి.రాధిక 967 మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ మోడల్ స్కూల్‌లో..

గరిడేపల్లి : ఇంటర్ ఫలితాల్లో మండలంలోని కస్తూరిబా గాంధీ, గడ్డిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గడ్డిపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఎం.జ్యోతి 461 మార్కులు, సాయి సిరి 449, బైపీసీ విభాగంలో బి.పల్లవి 355, డి.బుజ్జి 350, సీఈసీ విభాగంలో ఎన్.మౌనిక 375, సీహెచ్ నవ్య 366, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో బి.శిల్ప 960, సుష్మిత 942, బైపీసీలో బి.అంజన 954, ఎం.తేజస్వీ 905, సీఈసీలో ఎం.రమ్య 871, రేణుక, 619 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. 92 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా 54 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సెకండియర్‌లో 88 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 74 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

కస్తూరిబా గాంధీ పాఠశాలలో..

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో భయ్యా నవ్య 422, బైపీసీలో బాణోతు శిరీష 403 మార్కులు సాధించారు. సెకండియర్‌లో ఎంపీసీ విభాగంలో కె.అనూష, 967, బైపీసీలో జె.మహేశ్వరి 928 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో 20 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 18 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెంకడియర్‌లో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ యల్లావుల శైలజ తెలిపారు.

అత్యధిక మార్కులు 'కేఆర్‌ఆర్' సొంతం

కోదాడఅర్బన్ : తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కోదాడకు చెందిన కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విద్యార్థి తొండల నవ్య 964/1000 మార్కులు, పిల్లుట్ల లోక్యా 958/1000 మార్కులు సాధించారు. కళాశాల నుంచి అనేక మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు.

బైపీసీ విద్యార్థుల హవా

మఠంపల్లి : ఇంటర్ ఫలితాలలో మఠంపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లోని జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థులు బానోతు స్వప్న 949/1000, భూక్యా సోనియా 949/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కొందరు మంచి మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

'ఎస్వీ'విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్వీ కళాశాల చైర్మన్ సైదేశ్వరరావు

కోదాడఅర్బన్ : తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర టెక్నో జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ ముత్తినేని సైదేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.సమిత 960/1000, ఎం.విజయశ్రీ 977/1000, సీఈసీలో ఎస్‌కే జానీపాషా 896/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో పి.వినయ్ 460/470, సీఈసీలో షేక్ జాహిద్ ఆఫ్రిది 468/500లు సాధించి టౌన్ టాపర్‌లుగా నిలిచినట్లు చెప్పారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ సైదేశ్వరరావు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

సత్తా చాటిన 'శ్రీమేధా'



బి.భవితరెడ్డి, ఎంపీసీ (465)



ఎం.మనీష, ఎంపీసీ (465)



వి.నిశాంత్, ఎంపీసీ (465)

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణానికి చెందిన శ్రీమేధా అకాడమీ విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి తమ సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ఎంపీసీ విభాగంలో బి.భవితరెడ్డి, యం.మనీషా, వి.నిషాంత్‌లు (465/470) మార్కులు సాధించారు. మరో ఐదు మంది విద్యార్థులు 464/470 మార్కులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగులకు న్యాయం

హుజూర్‌నగర్ : తెలంగాణలోని నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండీ అజీజ్ పాషా అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ ప్రకటించడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, కోల మట్టయ్య, సమ్మెట సుబ్బరాజు, ముషం సత్యనారాయణ, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంగా మారిందని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డులలో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.1.94 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు హరిబాబు, కౌన్సిలర్లు కేఎల్ఎన్‌రావు, జక్కుల శంభయ్య, ములకలపల్లి రామ్ గోపి, అట్లూరి మంజుల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు ప్రకటించాలి

మునగాల : రాష్ట జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు బీసీ బంధు ప్రకటించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ కులాల్లో అతి పెద్ద కులాలైన కుమ్మరి, మంగలి, చాకలి, వడ్రంగి, పద్మశాలీ, వడ్డెర తదితర కులాల్లో పేదలు ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓట్ల కోసం వర్గాలుగా చీల్చి లబ్ధి పొందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీసీ బంధు ప్రకటించి బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనియెడల బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం



నేరేడుచర్ల : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య



మఠంపల్లి : చౌటపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పార్వతి

హుజూర్‌నగర్‌రూరల్ : అంధత్వ రహిత సమాజాన్ని నిర్మించడంతో పాటు ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీనివాసపురంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పత్తిపాటి రమ్య నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఏరియా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది నియామకం, మౌలిక సౌకర్యాల కల్పనతో పేదలకు మెరుగైన వైద్యాన్ని ఎమ్మెల్యే సైదిరెడ్డి అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గురవయ్య, చావా వీరభద్రరావు, కట్ట సతీష్, డాక్టర్ మంగ, సూపర్‌వైజర్ శ్రీనివాస్, కార్యదర్శి ఉపేందర్, ఏఎన్‌ఎం అలివేలుమంగ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పులగంబండతండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదమ్మ, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ విజయకుమారి, కార్యదర్శి ప్రవీణ్, వైద్య సిబ్బంది వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చిలుకూరు : గ్రామాల్లో ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ ధీరావత్ మంగమ్మ సైదులు అన్నారు. మంగళవారం మండలంలోని సీత్లాతండా గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్‌నాయక్, వార్డు సభ్యులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : ప్రభుత్వం ప్రజలు కంటి సమస్యల నుంచి బయట పడేందుకు ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పార్వతీకొండానాయక్ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని చౌటపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ సైదాకుమారి, ఉపసర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీఓ ఆంజనేయులు, వైద్యబృందం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్-2023 క్రీడలను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్‌రూరల్ : మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్ కప్ 2023 ను మండల స్థాయిలో విజయవంతం చేయాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సమన్వయ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డితో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. మండలస్థాయి సీఎం కప్‌లో భాగంగా పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు ఉదయం 9 గంటలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు 15 సంవత్సరాల వయస్సు నుంచి 36 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాంతకుమారి, డీటీ సుధారాణి, సూపరింటెండెంట్ నర్సిరెడ్డి, చంద్రకళ, పీఈటీలు సునీల్, బ్రహ్మారెడ్డి, శ్రీధర్, రవీందర్ రెడ్డి, విజయ్, సీఆర్పీ సైదులు పాల్గొన్నారు.

15 నుంచి మండల స్థాయి క్రీడలు

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 15 నుంచి 17 వరకు సీఎం కప్‌కు సంబంధించి మండల స్థాయిలో యువతీ, యువకులకు క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య మంగళవారం తెలిపారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండల స్థాయి సీఎం కప్ 2023 ను జయప్రదం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకుందాం

హుజూర్‌నగర్‌రూరల్ : లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు అన్నారు. బీజేపీకో హటావో దేశ్‌కో బచావోలో భాగంగా మంగళవారం మండలంలోని అమరవరంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. హుజూర్‌నగర్, బూరుగడ్డ, సీతారాంపురంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేసి పేద ప్రజలకు పంపిణీ చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, అనంతు వీరబాబు, కందుల వెంకటేశ్వర్లు, వాసుదేవరావు, నాగార్జున, బాదె నర్సయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేఆర్‌ఆర్ కళాశాలలో కబడ్డీ శిక్షణ శిబిరం

కోదాడఅర్బన్ : పట్టణంలోని కేఆర్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఖేలో కబడ్డీ అకాడమీ ఆధ్వర్యంలో బాల, బాలికలకు ఉచిత వేసవి కబడ్డీ శిక్షణ ఇస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నామ నర్సింహారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఉదయం 6 గంటల నుంచి 8 వరకు, సాయంత్రం 5గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు, భవిష్యత్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణకు 12 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని, క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో పాటు పాస్ ఫొటోతో సంప్రదించాలని కోరారు. వివరాలకు సెల్ నెంబర్ 9912381165ను సంప్రదించాలని కోరారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి



సంతకాలు సేకరిస్తున్న జాతీయ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి

హుజూర్‌నగర్ : భారత రెజ్లింగ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి, ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు న్యాయం చేయాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. రెజ్లర్లకు మద్దతుగా మంగళవారం భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని గాంధీపార్క్ సెంటర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి యల్లావుల ఉమ, లత, అశ్విని, లక్ష్మి, లలిత, సత్యవతి, కుమారి, వీణ, పద్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రెజ్లర్లను వేధింపులకు గురి చేస్తున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, కస్తూరి, సంధ్య, సాంబ, రమణ, నాగమణి, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీనియర్ క్రీడాకారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో స్థానిక శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫౌండర్ సుధాకర్‌రెడ్డి, కబడ్డీ సీనియర్ క్రీడాకారులు, స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని వినతి



చిలుకూరు : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

చిలుకూరు : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎంపీడీఓ ఈదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ జూనియర్ కార్యదర్శుల సమ్మెకు తమ ఉపాధ్యాయ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా, మండల నాయకులు అచ్చుత్ జనార్దన్, గుజ్జుల నరసింహారెడ్డి, శ్రీనివాస్, బచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, ఆంజనేయులు, మండవ ఉపేందర్ పాల్గొన్నారు.

జేపీఎస్‌లను బెదిరించడం సరికాదు

నేరేడుచర్ల : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కారించకుండా, వారిని తొలగిస్తామని ప్రభుత్వం బెదిరించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. పంచాయతీ కార్యదర్శులుగా మూడేళ్ల నుంచి విధులను నిర్వర్తిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం ప్రభుత్వం మొండి వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ఇప్పటికైనా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తీరు మార్చుకోవాలి

పాలకవీడు : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ పన్నెండు రోజులుగా నిరవధిక నిరసన సమ్మె చేస్తున్న జూనియర్ కార్యదర్శులపై ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. నిన్న విద్యుత్ ఉద్యోగుల పట్ల, నేడు జేపీఎస్‌ల పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకొని ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి



ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి

అనంతగిరి : మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డా.కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. మంగళవారం మండలంలోని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మహిళలకు 57 రకాల పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ రాగమౌనిక, రత్నమేరీ, శైలజ, మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మునగాల : ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. మంగళవారం మండల కేంద్రం శివారులో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాములు మాట్లాడుతూ.. చట్టప్రకారం ప్రతి వారం రోజులకు వేతనాలు చెల్లించాలని కానీ మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఉపాధి చట్టంలో తాగునీరు, టెంటు, పార, గడ్డపార సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించాలని లేనియెడల ఉపాధి కూలీలతో ఎంపీడీఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సొంపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఆరె.రామకృష్ణారెడ్డి, మండల నాయకులు కిన్నెర వెంకన్న, గడ్డం వెంకన్న, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఐదుగురు అరెస్ట్

హుజూర్‌నగర్: నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారుల వివిధ చోట్ల దాడులు జరిపి ఐదుగురిని అరెస్ట్ చేశారు. 200 కేజీల బెల్లం, 38 లీటర్ల సారా, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాలకీడు మండలం బెట్టెతండాలో ఎం రమేష్, ఎం లక్ష్మీతిరపతమ్మ ఇండ్ల పైదాడి చేసి 20 లీటర్ల సారాయితో పాటు 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మఠంపల్లికి చెందిన ఎస్ మగతా ద్విచక్ర వాహనంపై 8 లీటర్ల సారా తరలిస్తుండగా ఆ వాహనాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. బెట్టెతండా నుంచి గుడుగుంట్ల పాలెంకు బెల్లం సారి తరలిస్తున్న ఎం శ్రీను, ఎం సైదాలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 200 కేజీల బెల్లం, 10 లీటర్ల సారాయి, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులలో బెల్లం సరఫరా చేసిన బాణావత్ శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు సతీష్‌రెడ్డి, దివ్య, సిబ్బంది నాగరాజు, రవి, నాగయ్య, ధనుంజయ్, జయరాజ్, నాగమణి పాల్గొన్నారు.